# ఐదుగురు యోధులు

## సంపత్

**ఆ**దొక జైలు!

ఆ జైలు చుట్టూ పది అడుగుల ఎత్తులో పటిష్టమయిన గోడ కొండరాతితో నిర్మించబడి వుంది.

జైలు భవనాలముందు, విశాలమయిన ఖాళీ స్థలంలో వరసగా నిలబడి వ్యాయామం చేస్తున్న ఖైదీలంతా, మెయిన్ గేటు తెరుచుకొని ఒక జీప్ రివ్వున రావటంతో, వ్యాయామం ఆపివేసి ఎక్కడివారక్కడే నిలబడిపోయారు.

జీప్‌లో నుండి పొడుగ్గా, బలిష్టంగా నున్న ఒక వ్యక్తి క్రిందకుదిగి ఖైదీలనందనీ పరిశీలించాడోమారు. అతను మిలటరీ యూనిఫాంలో ఉన్నాడు. బలిష్టంగా, కండలు తిరిగి

ఉన్నాడు. మీసాలు లేవు. అయినా అతని ముఖం అందం గానే ఉంది. తలపై కేప్ ఉంది.

అందరూ అతన్ని విచిత్రంగా చూశారు. కారణం, సాధారణంగా అక్కడికి ఎవరూ రారు.

అతిప్రమాదకరమైన వ్యక్తుల్ని బంధించే జైలు అది. దాని ఉనికే సరిగ్గా తెలియదు చాలా మందికి. ఒకసారి దానిలోనికి ప్రవేశించితే తిరిగి రావటం కల్ల. ఆ జైలు చుట్టూ కట్టిగోడ పది అడుగుల ఎత్తులో నిర్మింపబడిఉంది. ఒకేఒక మెయిన్ గేటు. అక్కడ ఎప్పుడూ కాపలా ఉంటుంది. అదీగాక గోడపై తీగతో వల ఉండి, దానిలో రాత్రి సమయంలో కరెంటు ప్రవహిస్తుంటుంది.

అటువంటి ఆ జైలులోకి వచ్చిన ఆ మిలటరీ వ్యక్తిని ఖైదీలంతా కుతూహలంగా చూడసాగారు. అతను ప్రతి ఖైదీ వద్దకు వెళ్ళి నిశితంగా చూడనారంభించాడు.

ఆ మిలటరీ వ్యక్తి వెనుకే జైలు సూపరింటెండెంట్ నడవసాగాడు. చేతులు వెనక పెట్టుకొని, ఒక్కొక్క ఖైదీని చూస్తూ నడుస్తున్నాడతను, జైలు సూపరెంటెంటు చెప్పే మాటలు వింటూ.

కొంతదూరం పోయాక హఠాత్తుగా ఆగిపోయా డతను. అతని చూపులు ఒక ఖైదీపై నిలిచిపోయాయి.

దృఢంగా, లావుగా ఉన్నాడా ఖైది. కళ్ళు, ఎర్రగా, క్రూరంగా ఉన్నాయి. అప్పటి వరకు బస్కీలు తీసి ఉండటంవల్ల, ఒళ్ళంతా చెమటతో తడిసిపోయి ఉంది. నల్లగా ఉన్నాడు. దుబ్బుగా ఉంది జుట్టు.

తన ముందాగి, తన కళ్ళల్లోకి చూస్తున్న మిలటరీవాని కళ్ళల్లోకి సూటిగా చూశాడా ఖైది.

"నీ పేరు?" మిలటరీ వ్యక్తి ప్రశ్నించాడు మెల్లగా.

"రాజన్." ఉరిమినట్లుందా ఖైదీ స్వరం.

"తమిళియన్?"

అవునన్నట్లు తల ఊపాడు ఖైది. మిలటరీ వ్యక్తి తన వెనక నడుస్తున్న జైలు సూపరెంటెంటు వైపు చూశాడు.

"రాజన్! వెళ్ళి ఆఫీసు గదిలో కూర్చో నీతో పనుంది" అన్నాడు సూపరెంటెంటు.

"ఏమిటో అది తెల్సుకోవచ్చా?"

"ముందు పద. తరవాత తెలుస్తుంది!" ముందుకి కది లారు యిద్దరు. రాజన్ వెళ్ళిపోతున్న వారివైపు చూసి తలెగరేశాడు. ఆఫీసు వైపు నడుస్తున్న రాజన్ని అంతా కుతూహలంతో చూడసాగారు.

మిలటరీ వ్యక్తి మరికొంతమంది ఖైదీలను చూసుకుంటూ పోయి, మరో ఖైదీ దగ్గర ఆగాడు.

ఆ ఖైదీ వయస్సు దాదాపు నలభై సంవత్సరాలుంటాయి ఎర్రగా, బలంగా ఉన్నాడు. కళ్ళు అమాయకంగా ఉండి, అతన్ని చూస్తే క్రూరమైన మనస్సుగలవాడని ఎవరూ అనుకోలేరు. మంచి పర్సనాలిటి. అయిదున్నర అడుగుల ఎత్తుంటాడు.

"నీ పేరు?" ప్రశ్నించాడు మిలటరీ వ్యక్తి.

"జానీ!" పెడసరంగా జవాబిచ్చాడు అతను. నవ్వాడు మిలటరీ వ్యక్తి. నవ్వి, సూపరెంటెంటు వైపు తిరిగి చూశాడు.

జానీ కూడా ఆఫీసులోకి నడిచాడు.

అదేవిధంగా ఖైదీలనందరినీ పరీక్షించి మరో ఇద్దర్ని ఎన్నిక చేశాడు మిలటరీ వ్యక్తి. ఆ ఖైదీల పేర్లు రతన్, సులేమాన్లు. వారిద్దరు చూడటానికి అంత దృఢంగా

కన్పించరు. సామాన్యంగా కన్పించినా విపరీతమయిన బలం ఉంది వాళ్ళ ఒంట్లో. తెలివితేటలు కూడా అధికం. తోడు దొంగలు. రెండు, మూడు మార్లు జైలునుంచి పారి పోవటానికి ప్రయత్నించి పట్టుబడి ఎన్నో హింసల ననుభ వించారు.

నలుగురు ఆఫీసులో బల్లమీద కూర్చొని మిలటరీ వ్యక్తి రాకకై ఎదురు చూస్తున్నారు.

పదినిమిషాల తరవాత ప్రవేశించాడతను. వస్తూనే, "గుడ్ మార్నింగ్. నా పేరు రవిశంకర్. కెప్టెన్ రవి శంకర్!" అన్నాడు నవ్వుతూ.

ఖైదీలు నలుగురు మాట్లాడలేరు. కనీసం నవ్వనయినా లేరు. "మీలో మీకు తెలుసు. అయినా మరోమారు పరి చయం చేస్తాను!" అని ఖైదీలను ఒకరి కొకరు పరిచయం చేశాడు రవిశంకర్. పరిచయాలయ్యాక నలుగురూ కెప్టెన్ రవిశంకర్ వంక కుతూహలంగా చూస్తూ కూర్చున్నారు.

రవిశంకర్ చెప్పటం ప్రారంభించాడు.

"ఫ్రెండ్స్! మీరంతా నేరాలు చేసి శిక్ష అనుభ విస్తున్న వాళ్ళని నాకు తెలుసు. అవకాశం వస్తే మీలో చాలా మంది నేరాలు చేయటం మానివేసి నూతన జీవితం గడపటానికి సిద్ధంగా ఉన్నారు. ఇప్పుడు మీరు మాతో సహకరిస్తే మీ జైలుశిక్ష రద్దు చేస్తుంది ప్రభుత్వం. అంతే గాదు, సర్వ సౌభాగ్యాలతో జీవించటానికి ఏర్పాట్లు చేస్తుంది."

ఆగాడు రవిశంకర్. చెవులప్పగించి వింటున్నారు నలు గురు. "ఇక సూటిగా విషయం చెబుతాను వినండి. ప్రస్తుతం మన దేశానికొక పెద్ద ప్రమాదం వొచ్చిపడింది. దానిని తొలగించటానికి మనమంతా పూనుకోవాలి. మీ

సందేహాలు నాకు తెల్సు. సి. బి. ఐ. ఏజంట్లు, సి. ఐ.డి.లు ఎన్నో వందలమంది ఈ విషయంలో నియమించబడ్డారు. కాని విచిత్రంగా అందరూ మాయమయిపోయారు. బహుశా ఏజంట్ల వివరాలను శత్రువులు తెల్సుకున్నారని ప్రభుత్వం భావిస్తోంది.''

ఆగి, జేబులోనుంచి సిగరెట్ తీసుకుని ముట్టించుకున్నాడు రవిశంకర్.

''మేమేం చేయాలి?'' సులేమాన్ అన్నాడు చిన్నగా.

''అదే చెప్పబోతున్నాను.'' ఒకదమ్ము పీల్చి చెప్పటం ప్రారంభించాడు కెప్టెన్.

''మీరు నేరస్తులయినా ధైర్యం, చొరవ, సాహసం గలవాళ్ళు. అవకాశం వస్తే కొండలనయినా పిండి చేయగలవాళ్లు. మీ అందరి గురించి సర్వస్వం తెలుసుకున్నాను. ఇప్పుడు మీ శక్తిని, నిజాయితీనీ నిరూపించుకునే అవకాశం వచ్చింది. ఈ జైలు జీవితం నుంచి బయట పడొచ్చు.''

''ఏం చేయాలో_చెప్పండి!'' విసుగ్గా అన్నాడు జాని. అతని వంక చూశాడు రవిశంకర్. ''నేనిది ఊరికే చెప్పటం లేదు మిస్టర్ జానీ. మీకు వచ్చిన అవకాశం గురించి వివరిస్తున్నాను. మీరు నలుగురు నాకు సహకరించాలి. మనం అయిదుగురం శత్రుస్థావరాన్ని ధ్వంసం చేయాలి.''

''ఎక్కడుంది?'' ఆత్రంగా ప్రశ్నించాడు సులేమాన్.

''ఆ వివరాలు తరువాత చెబుతాను. ముందు నాకు ప్రామిస్ చేయాలి. నేను మీకు నాయకుడిగా వ్యవహరిస్తాను. నా ఆజ్ఞలు తు. చ. తప్పకుండా ఆచరించి తీరాలి. మీరు సాయం చేస్తే ఆ స్థావరాన్ని నాశనం చేయటం అసాధ్యమేమికాదు.''

రెండు నిమిషాలు నిశ్శబ్దం అలుముకుంది.

"ఆల్ రైట్! మీ షరతులన్నిటికీ అంగీకరిస్తున్నాం!" అన్నాడు రతన్.

"ఇక్కడ షరతులంటూ ఏమీ లేవు. మనం అంతా ఒకటే. ఒకరినొకరు సహకరించుకోవాలి. అవసరమయితే ప్రాణాలుకూడా అర్పించాలి. రంగంలోకి దిగిన తర్వాత వెనుకంజ వేయకూడదు. ఎవ్వరూ తప్పించుకోవటానికి ప్రయత్నించకూడదు. ఈ ఆపరేషన్‌లో పాల్గొనటం యిష్టంలేకపోతే యిప్పుడే మానుకోవచ్చు. బలవంతం మేమీ లేదు."

అందరూ తలలూపారు.

కెప్టెన్ రవిశంకర్ వారితో ఏమేమి చేయాలో వివరించ నారంభించాడు.

## 2

దట్టమయిన అడవిలోగుండా పోతూంది ట్రక్కు. సులేమాన్ డ్రైవింగ్‌లో దిట్ట అవటంవల్ల అతనే ట్రక్కుని నడుపుతున్నాడు. పెద్ద పెద్ద చెట్లు, పొదల మధ్యగుండా అతి చాకచక్యంగా నడుపుతున్నాడు ట్రక్‌ని. ఇప్పుడతను మిలటరీ దుస్తులలో వున్నాడు. మిగిలినవారు కూడా ఆదే డ్రస్‌లో వున్నారు. ట్రక్ లోపల జానీ, రతన్, రాజన్‌లు కూర్చొని వున్నారు. కెప్టెన్ రవిశంకర్ సులేమాన్ ప్రక్క కూర్చొని దారిని చూపుతున్నాడు. ట్రక్ కుదుపులకు అంతా ఎగిరెగిరి పడుతున్నారు. దారి అంతా సరిగ్గా లేక ఎత్తుపల్లాలుగా వుంది. అక్కడక్కడ బురదగా వుంది.

ఉన్నట్లుండి ట్రక్ ఆగిపోయింది.

తమకు, డ్రైవర్‌కు మధ్యనున్న చిన్న చెక్క తలుపు ప్రక్కకులాగి ఏమయిందని ప్రశ్నించాడు రతన్.

"వెనకచక్రం బురదలో ఇరుక్కు పోయింది. దిగి తోయాలి!" జవాబిచ్చాడు కెప్టెన్ రవిశంకర్.

రాజన్, జానీ, రతన్‌లు క్రిందకుదిగారు. చుట్టూ అడవి దట్టంగా అల్లుకుపోయి ఉంది. సూర్యకాంతి సరిగ్గా కన్పించటం లేదు. ట్రక్ హెడ్‌లైట్స్ వెలుగుతున్నాయి.

"ఇంతకంటె మంచి మార్గంలేదా?" రాజన్ ప్రశ్నించాడు రవిశంకర్‌ని.

"ఉంది. అయితే ఇదే మనకు అనువయిన రూటు, మనం అక్కడికి వెళుతున్నట్లు ఎవరికీ తెలియకుండా ఉంటుందని యిటువైపు వచ్చాము."

నేలంతా బురదగా వుంది. అడుగుతీసి, అడుగువేస్తే జారిపోతూంది. అయిదుగురి కాళ్ళకు దళసరి బూట్లుండటం వల్ల కాళ్ళకు బురదకాలేదు. ట్రక్ ఎడమవయిపు వెనక చక్రాలు బురదలో కూరుకు పోయాయి. నలుగురూ ట్రక్‌ని బురదలోంచి బయటకు లాగటానికి ప్రయత్నించారు చక్రాలు తిరిగేకొంది మరింత లోతుకు పోతున్నాయి వెనక యిరుక్కుపోయిన చక్రాలు.

అరగంట కష్టపడి, అతిప్రయత్నం మీద ట్రక్‌ని బయటకు లాగ గలిగారు అయిదుగురు కల్సి. తిరిగి బయలు దేరారు. కెప్టెన్ రవిశంకర్ వాచ్ చూసుకున్నాడు. సాయంత్రం మూడుగంటలు దాటింది.

"మరో రెండు గంటల్లో చేరుకుంటాం!" అన్నాడు సులేమాన్‌తో.

తిరిగి బయలుదేరింది ట్రక్. అందరూ మౌనంగా వుండి పోయారు ఆలోచిస్తూ.

మధ్యలో రెండు, మూడు జంతువుల్ని వేటాడాడు రతన్.

సాయం సమయానికి సముద్ర తీరం చేరుకున్నారు. అడవి అంతమయిపోయి, అంతా సరివిచెట్లుతో దట్టంగా వుంది.

ఆ సరివిచెట్లమధ్య ఖాళీగా వున్న చోట ట్రక్ ఆపాడు సులేమాన్. క్రిందకు దిగారు అంతా. చెట్ల గుండా సముద్రం కన్పిస్తోంది. చకచక టెంట్ వేశారు, రెండు చెట్లునరికి, చదును చేసి. నాలుగుసరివి చెట్లను కలిపి, అడ్డంగా సరివి కొమ్మల్ని, మానుల్ని కట్టి చిన్న మంచెలాగా తయారు చేశారు.

ఈ లోపు రవిశంకర్ టీ కాచాడు. అయిదుగురూ త్రాగారు. చీకటి పడుతుండగా పాక్ చేసిన ఫుడ్ పాకెట్స్ ఇచ్చాడు రవిశంకర్. వాటిని తిన్నారు అయిదుగురు.

"ఈ రాత్రికి విశ్రాంతి తీసుకోండి. గుడ్ నైట్. కాపలాగా నా డ్యూటి రెండు గంటలకు. అప్పుడు లేపండి! గుడ్ నైట్!" అని చెప్పి గుడారంలోకి నడిచాడు రవిశంకర్.

## 3

రాత్రి పదిగంటలు దాటింది.

పౌర్ణమి రోజులు కావటంవల్ల వెన్నెల పిండారబోసినట్లుంది. వాతావరణం నిశ్శబ్దంగా వుండి, భయం గొలుపుతూంది. సముద్రపు హోరు విన్పిస్తూంది స్పష్టంగా.

అంతవరకు రైఫిల్ పట్టుకొని కాపలా కాస్తూ కూర్చున్న రాజన్ లేచి, ఆవలించాడు. ఒకసారి ఒళ్ళు విరుచుకొని, జేబులోంచి సిగరెట్ పాకెట్ తీసి, సిగరెట్టు వెలిగించుకున్నాడు. గట్టిగా రెండు పీల్పులుపీల్చగానే శరీరంలోకి హుషారు వచ్చినట్లనిపించింది.

సముద్ర తీరంలో, ఇసుకలో నడవాలనిపించింది. టెంట్ లోంచి తొంగి చూశాడు. చిన్న కొవ్వొత్తి వెలుగుతూంది. కెప్టెన్ రవిశంకర్ గాఢ నిద్రలో ఉన్నట్లు ఉచ్ఛ్వాస, నిశ్వాసాలు వినిపిస్తున్నాయి. ట్రక్ లో మిగిలిన ముగ్గురూ నిద్రపోతున్నారు.

సరివి తోపు వాటి ఇసుకలోకి నడిచాడు. కొంతదూరం నడవగానే తనవెనక ఎవరో నడుస్తున్నట్లు శబ్దం అయి, చటుక్కున వెనుదిరిగాడు, రైఫిల్ పొజిషన్ లో పట్టుకొని.

"రాజన్! నేను రతన్ ని!"

దీర్ఘంగా నిశ్వాస వదలి, రైఫిల్ ని క్రిందకు దించాడు రాజన్. ఆగిపోయిన రతన్ ముందుకు నడిచి రాజన్ ని కలిశాడు. ఇద్దరు మౌనంగా కొంతదూరం నడిచారు ఇసుకలో. రాజన్ ని అడిగి సిగరెట్ తీసుకున్నాడు రతన్.

"పైకి మంచిగా కన్పిస్తున్నా రవిశంకర్ చాలా దుర్మార్గుడు" ఉపోద్ఘాతంగా అన్నాడు రతన్ పొగవదిలి.

"నీకెలా తెల్సు?"

ఇద్దరు ఇసుకలో సముద్రానికి అభిముఖంగా కూర్చున్నారు. రాజన్ మెళ్ళో పవర్ ఫుల్ బైనాక్యులర్స్ వేలాడుతూంది. కూర్చొని దానిని ముందుకు లాక్కుని సముద్రాన్ని దిగంతాల వరకు పరిశీలించి చూశాడు.

"ఆర్మీలో నా ఫ్రెండ్ ఒకడు వున్నాడు. అతడు చెప్పాడు. రవిశంకర్ దురాగతాలన్నీ కథలుగా చెప్పేవాడు సెలవలకి వచ్చినపుడు."

రాజన్ నవ్వాడు రతన్ వంక చూసి.

"నీ స్నేహితుడు చెప్పే కథలు వినేంత తీరికగా ఉన్నావా?"

"అయితే నేను చెప్పేది అబద్ధమంటావా?" చిన్న బుచ్చుకొని అన్నాడు రతన్.

"ఛ...ఛ. అలా ఎందుకంటాను నేను? మిలటరీలో స్ట్రిక్ట్‌గా వుంటారు. డిసిప్లిన్ మెయిన్ టెయిన్ చేస్తుంటారు. కెప్టెన్ రవిశంకర్ మరీ స్ట్రిక్ట్ మనిషి అయ్యుంటాడు. అతని ప్రవర్తన నచ్చని నీ స్నేహితుడు అతన్ని గురించి నీతో చెడుగా చెప్పి వుండవచ్చు."

రతన్ మాట్లాడ లేదు.

"అయినా కెప్టెన్ ఎటువంటి వాడయితే మనకెందుకు? నేరాలు చేసి, శిక్షలు అనుభవించి, నా మనస్సు, శరీరం అలిసిపోయింది. మంచిగా బ్రతుకుదామనుకున్నాను. కాని ఓ హత్య చేయటం తప్పనిసరి అయింది. తీసుకువెళ్ళి ఆ జైలులో పారేశారు. ఇన్నాళ్ళకి అవకాశం కల్సివచ్చింది. ఇకనయినా జీవితాన్ని ప్రశాంతంగా, ఏ ఒడిదుడుకులు లేకుండా గడపాలని వుంది."

రాజన్ మాటల్లో ఎంతో ఆవేదన ధ్వనించింది రతన్‌కి.

"ఆపరేషన్ అయిపోయాక కెప్టెన్ మనల్ని ఒదులుతాడా?" సందేహిస్తూనే అడిగాడు రతన్.

రాజన్, రతన్ వంక తిరిగాడు. "రతన్! నిజం చెప్పు. నువ్వీ ఆపరేషన్‌లో మనస్ఫూర్తిగా పాల్గొంటున్నావా?" సూటిగా అడిగాడు.

రతన్ సమాధానం యివ్వలేదు.

"నీ వాలకం చూస్తుంటే బలవంతంగా ఈ పనికి ఒప్పుకుంటున్నట్లు అన్పిస్తుంది నాకు. కెప్టెన్ ముందే చెప్పేడు. బలవంతం ఏమీ లేదని."

"నిజంగానే నాకు యిష్టం లేదు. కాని ఒచ్చిన అవ

కాశాన్ని వదులుకోలేను. ఆ జైలునుంచి బయటపడటం అసాధ్యం. అందుకే ఒప్పుకున్నట్లు నటించి, తప్పించుకోవటానికి ప్రయత్నిస్తున్నాను.'' చెప్పాడు రతన్.

''మరి యింతకాలం ఏం చేశావ్? దాదాపు రెండు నెలలు మనకి అన్ని విషయాలలో ట్రెయినింగ్ యిచ్చారు గదా! అప్పుడు తప్పించుకోలేకపోయావా?'' వ్యంగ్యంగా అన్నాడు రాజన్.

''అవును. తప్పించుకుందామనే అనుకున్నాను. కాని అనుక్షణం కెప్టెన్ కళ్ళు నామీదే ఉండేవి. నేనేం చేస్తున్నా, ఎక్కడున్నా గమనించేవాడు. ఆయన నన్ను అనుమానించాడు.''

''ఇప్పుడు మాత్రం ఎలా తప్పించుకుంటావ్?''

రతన్ జవాబు యివ్వలేదు. నోరు తెరిచి ఏదో చెప్పబోయాడు. ఆదేక్షణంలో వెనక ఎవ్వరో ఉన్నట్లనిపించి తల త్రిప్పి చూశాడు. రతన్ ఏదో చెప్పబోయి, ఆగిపోవటం, తలత్రిప్పి వెనక్కు చూడటం గమనించి రాజన్ కూడా తల వెనక్కి తిప్పాడు.

కొద్దిదూరంలో కెప్టెన్ రవిశంకర్ నిలబడి వున్నాడు. ఆయన్ని చూడగానే రతన్ తల వాలిపోయింది.

''మిస్టర్ రతన్! నేనెప్పుడో చెప్పాను. ఎవ్వరూ బలవంతంమీద ఒప్పుకోవద్దని. ఆల్ రైట్ నిన్ను ఫ్రీగా వదిలేస్తాను. రేపే వెళ్ళిపోవచ్చు.'' గిరుక్కున వెనుదిరిగి వెళ్ళిపోయాడాయన.

''కెప్టెన్‌కి కోపం వొచ్చినట్లుంది. ఒకవేళ మన మాటలు వినలేదు గదా?'' రాజన్ అన్నాడు టెంట్ వైపు నడుస్తూ.

రతన్ తలవంచుకుని అతన్ని అనుసరించాడు.

ఉదయం ఆరు గంటలయింది.

రాజన్ టీ కాచి యిచ్చాడు అందరికి. తాగుతూ చెప్ప సాగాడు కెప్టెన్ రవిశంకర్.

"ఫ్రెండ్స్! మనం మనదేశానికి వాటిల్లబోయే ప్రమాదాన్ని నివారించడానికి బయులుదేరాం. ఈ ఆపరేషన్‌లో మన ప్రాణాలు పోవచ్చు. కాని మన ధ్యేయం ఒక్కటే. ఎలాగయినా శత్రువుని నాశనం చేయాలి.

మనలో కొందరికి ఇందులో పాల్గొనటం యిష్టం లేనట్లుంది. వారిని యిప్పుడే పంపించివేస్తాను. మీరందరూ వెళ్ళినాసరే, చివరకు నేనొక్కణ్ణి అయినా ఒంటరిగా ఈ కార్యం నిర్వహించటానికి ప్రయత్నిస్తాను," ఆగి రతన్ ముఖంలోకి చూశాడు.

"యస్ సర్! మేమంతా మనస్ఫూర్తిగా ఇందులో పాల్గొంటున్నాం. మా ప్రాణాలు సైతం ధారపోయడానికి సిద్ధంగా వున్నాము." అన్నాడు రతన్.

చిరునవ్వు నవ్వాడు కెప్టెన్ రవిశంకర్.

"గుడ్! ఈ క్షణంనుంచి మనం పాత విషయాలను మరిచిపోదాం. ఇక మరోసారి వివరాలు చెబుతాను. జాగ్రత్తగా వినండి!"

ఆగి, అందరివంక ఓమారు చూసి చెప్పటం ప్రారంభించాడు కెప్టెన్ రవిశంకర్.

"సుమారు మూడు నెలల క్రితం ఇండియాయొక్క స్పెషల్ బ్రాంచ్ ఏజంట్లు, ఇతర ముఖ్య అధికార్లు అందరూ విచిత్రంగా మాయం అయిపోయారు. కొంత మంది మరణించారుకూడా. ఇది గ్రహించి భారతప్రభుత్వం కలవరపడింది. బ్రాంచి ఏజంట్ల మరణాల, అంతర్ధానాల

వెనకనున్న విషయాలు తెలుసుకోవటానికి ప్రయత్నించింది. కాని చిన్న క్లూ కూడా దొరకలేదు.

మన రక్షణ విషయాలకు సంబంధించిన అధికార్లుకూడా కొంతమంది మాయం అయ్యారు. ఈ విషయం చాలా కొద్దిమందికే తెలుసు. వారి విషయంకూడా తెలియరాలేదు.

ఇది ఇలా వుండగా హిందూ మహాసముద్రంలో అగ్రరాజ్యాల నౌకల సంచలనం ఎక్కువయింది. ఎవరికివారే తమ నౌకాబలాలను ఈ ప్రాంతంలో వృద్ధిచేసుకోనారంభించారు. అనేక దేశాలకు సంబంధించిన నౌకలు ఆ జలాలలో తారసపడటం ప్రభుత్వం గమనించింది.

మనదేశం మొదటినుండి శాంతికి, అహింసకు దీక్షా కంకణం పూనింది. ఏవిధమైన యుద్ధాలు, కలతలూ లేకుండా ప్రపంచ ప్రజలంతా ప్రశాంతంగా, తృప్తిగా జీవించాలనే వాంఛిస్తోంది. కాని అంతమాత్రాన చేతులు ముడుచుకొని కూర్చోదు.

దాదాపు రెండునెలల క్రితం మద్రాసుకు సమీపంలో గుర్తు తెలియని యుద్ధనౌక ఒకటి సంచరించటం మన తీర ప్రాంతపు గస్తీదళాలు తెలుసుకొని భారతప్రభుత్వానికి తెలిపాయి. అయితే మరుక్షణంలోనే అవి నాశనం అయ్యాయి.

అయితే ఆ నౌక ఏ దేశానికి సంబంధించినదో తెలియరాలేదు. దానిని ట్రేస్ చేయడానికి రకరకాలుగా ప్రయత్నించారు మనవాళ్ళు. అది ఏమయిందోకూడా తెలియరాలేదు.

ఇలా వుండగా మరలా ఆ నౌక ప్రత్యక్షమయిందని వార్త తెలిసింది ప్రభుత్వానికి.

అయితే ఆ విషయం తనకు తెల్సిందని బయట పడనివ్వ లేదు మన ప్రభుత్వం. అయితే ఇది అలుసుగా తీసుకొని ఆ నౌక సముద్రంలోనుంచే మిస్సైలీలను ప్రయోగించి భారతదేశానికి చెందిన కొన్ని నౌకలను నాశనం చేసింది.

ఇంతవరకు సహించి ఊరుకుంది మన ప్రభుత్వం. శత్రువుకి తగిన పాఠాలు చెప్పాలనుకుంది. అయితే దేశంలోని ఏజంట్లందరూ మాయం అయిపోయారు. అందువల్ల దానిని నాశనంచేసే బాధ్యత నాపై వుంచింది. నేను సహాయంగా మిమ్మల్ని తెచ్చుకున్నాను. అందువల్లే మీకు ట్రెనింగ్ అంతా యివ్వబడింది. మీరంతా సీక్రెట్ బ్రాంచ్ ఏజంట్ల వలె సుశిక్షితులు, తెలివితేటలు గలవాళ్ళు కాకపోవచ్చు. కాని మీ ధైర్యాన్ని, సమయస్ఫూర్తిని వినియోగించండి. మనదేశానికి వాటిల్లబోతున్న ఆపదని వారించండి.''

సుదీర్ఘమైన తన ఉపన్యాసంని ఆపాడు రవిశంకర్. అతని మాటలతో నల్గురిలో ఆవేశం, ఉత్సాహం వచ్చింది.

''ఏమి చేయాలో చెప్పండి?'' అన్నాడు జానీ ఉద్రేకంగా.

కెప్టెన్ రవిశంకర్ వివరించటం ప్రారంభించాడు: ''రెండు, మూడు రోజులలో ఆ వార్ షిప్ తిరిగి మన జలాలలో ప్రవేశించవచ్చు. రెండు, మూడు రోజులన్నది ఊజ్జాయింపు మాత్రమే. అసలది ఎప్పుడు వస్తుందో ఎవరికీ తెలియదు. ఎన్నాళ్ళయినా దానికోసం వెయిట్ చేయాలి. అది కన్పించగానే మనం అయిదుగురం దానిని సమీపిస్తాం. వీలుంటే పట్టుకుందాం, లేదా నాశనం చేద్దాం.''

''చిన్న సందేహం!'' అన్నాడు సులేమాన్. ఏమిటన్నట్లు అతనివయిపు చూశాడు కెప్టెన్ రవిశంకర్.

"అంత ధైర్యవంతమయిన ఏజంట్లందరు ఆ స్టీమర్‌లోనే వుంటారని భావిస్తున్నారా?"

"నా ఉద్దేశ్యం దానిలో ఉండకపోవచ్చని. శత్రు దేశానికి సంబంధించిన ముఠా ఒకటి మనదేశంలో పని చేస్తుంది. దానిని అణచివేయడానికి అనేక చర్యలు తీసుకుంటున్నారు. ఆ ముఠాకి, ఈ షిప్‌కు సంబంధం వుండొచ్చు, ఉండకపోవచ్చు. ఒకవేళ సంబంధం వుందని అనుకున్నా, అనుక్షణం తప్పించుకోచూసే మన ఏజంట్లని ఇక్కడినుండి తరలించి రిస్క్ తీసుకోవడంలో అర్థం వుండదు. బహుశా ఆ ముఠా స్థావరాలలోనే ఎక్కడో బంధింపబడి వుంటారని నా ఊహ."

సందేహం తీరినట్లు తలాడించాడు సులేమాన్. తిరిగి చెప్పటం ప్రారంభించాడు రవిశంకర్.

"ఇన్నాళ్ళుగా మీకు అందుకే చెబుతూ వస్తున్నాను. శత్రువులు మీకు ఆశ పెట్టవచ్చు. కోరినంత బంగారం, డబ్బు, ఏదడిగినా యిస్తామని ప్రలోభ పెట్టవచ్చు. అందుకే మొదటినుండి హెచ్చరిస్తున్నాను. దేనికీ లొంగకండి. మన ధ్యేయం ఒక్కటే. దేశద్రోహులు కావొద్దు!"

చెప్పటం ముగించి అందరి ముఖాలలోకి పరీక్షగా చూశాడు కెప్టెన్ రవిశంకర్. అందరూ తమలో తామే ఆలోచించుకుంటున్నారు.

చివరికి అన్నాడు సులేమాన్. "ఓ. కె. కెప్టెన్! ఈ ఆపరేషన్‌నుంచి నేను తప్పుకుంటున్నాను."

అందరు అదిరిపడి సులేమాన్ వంక చూశారు. రవిశంకర్ నమ్మలేనట్లు ముఖం పెట్టాడు.

"యస్ కెప్టెన్! మధువు, మగువకి నా మనస్సు లొంగకుండా వుండలేదు. వాటిని చూస్తేనే నా కళ్ళు చెదిరి

పోతాయి. ఎంత నిగ్రహించుకుందామనన్నా అదుపులో వుంచుకోలేను. అందుకే తప్పుకోవాలనుకుంటున్నాను" స్థిరంగా అన్నాడు సులేమాన్.

కెప్టెన్ రవిశంకర్, సులేమాన్ ముఖంలోకి చూశాడు సూటిగా. అతని కళ్ళల్లో ఏభావం లేదు.

"ఆల్ రైట్! ఇంకా ఎవరయినా వెళతారా?" మిగిలిన వారివైపు తిరిగి అన్నాడు. ఎవ్వరూ మాట్లాడలేదు. తిరిగి సులేమాన్ వంక చూశాడు కెప్టెన్ రవిశంకర్.

"ఆల్ రైట్ సులేమాన్! నీ మనస్సులో భావాన్ని బయట పెట్టినందుకు సంతోషం. నువ్వేం కోరినా ఇవ్వమని వ్రాసియిస్తాను. దాన్ని మీ జైలు సూపర్నెంటుకు చూపించు. మిగిలిన పని అతడే చూస్తాడు."

రవిశంకర్ గబ గబ టెంట్ లోకి నడిచి, కాగితాలు ముందేసుకుని, గబ గబ రాసి యిచ్చాడు. దాన్ని ఓ కవరులో పెట్టి సీలు వేసి, సులేమాన్ కు యిచ్చాడు.

"కెప్టెన్! నా రివాల్వర్, బైనాక్యులర్స్ తీసుకుపోవచ్చా?" సులేమాన్ అడిగాడు రవిశంకర్ ని.

"వాటితో పని ఉండదనుకుంటాను."

"ప్రాణరక్షణకయినా కావాలిగా!"

రవిశంకర్ అంగీకరించాడు. మరుక్షణమే తన సామాను అంతా తీసుకుని బయలుదేరాడు. రవిశంకర్ అతనికి వెళ్ళటానికి సులభమయిన మార్గం చెప్పాడు. వడి వడిగా నడిచాడు సులేమాన్.

## 5

మరో రెండు రోజులు గడిచాయి.

ఈ రెండు రోజులు వారి కార్యక్రమం ఒకటే. ఉదయాన్నే లేవటం, కాఫీ తాగటం, బైనాక్యులర్స్ తో

యిద్దరు సముద్రం వైపు చూస్తూ కూర్చోవటం; మిగిలిన యిద్దరు యితర పనులు చూడటం జరిగింది.

మూడో రోజు ఉదయం ఆరు గంట లవుతోంది. సూర్యుడు సముద్రంలోంచి లేస్తున్నాడు. దాని ప్రతిబింబం పెద్దదిగా వుండి ఎంతో మనోహరంగా వుంది. సూర్యకాంతి సముద్రపు జలాలపై ప్రసరించి బంగారు కాంతిని వెదజల్లుతోంది.

కెప్టెన్ రవిశంకర్ అప్పటికే లేచి కాలకృత్యాలు తీర్చుకొని మంచెమీద కూర్చొని బైనాక్యులర్స్‌తో చూస్తున్నాడు. ఏమాత్రం విసుగు పుట్టడం లేదతనికి. రతన్ కూడా అతని ప్రక్కనే కూర్చొని బైనాక్యులర్స్‌లోకి చూస్తున్నాడు. చూసి చూసి కళ్ళు నొప్పి పుడుతున్నాయతనికి. జానీ బ్లాక్ కాఫీ తయారు చేస్తున్నాడు. రాజన్ అడవిలోకి పోయాడు.

"కెప్టెన్!" ఉన్నట్లుండి హఠాత్తుగా అరవటంతో, రతన్ వంక చూశాడు రవిశంకర్.

"ఏదో స్టీమర్ వస్తున్నట్లుంది చూడండి!"

జానీ వాళ్ళిద్దరి వయిపు ఒకమారు చూసి తన పనిలో నిమగ్నమైపోయాడు.

రవిశంకర్ తనూ బైనాక్యులర్స్‌లోకి దృష్టి సారించాడు. ఏమీ కన్పించలేదు. దృష్టిని కాన్సన్ట్రేట్ చేసి చూడసాగాడు. అయిదు నిముషాల అనంతరం సూర్యబింబం ప్రక్కగా నల్లటి పొగ అస్పష్టంగా కన్పించింది. దాని మీద దృష్టిని నిలిపి, పరీక్షగా చూడసాగాడు కెప్టెన్ రవిశంకర్. మరో పదినిముషాలనంతరం పొగ మాత్రం స్పష్టంగా కన్పించసాగింది.

అయితే అది ఏ స్టీమరో తెలియదు. మామూలు పాసింజర్ వెసల్ కావచ్చు. కార్గో సర్వీసు కావచ్చు. అందుకే మౌనంగా చూస్తూండిపోయాడు.

అంతలో రాజన్ తిరిగి వచ్చాడు. విషయం తెల్సుకొని అతనూ మంచె ఎక్కాడు బైనాక్యులర్స్‌తో. జానీ మౌనంగా ముగ్గురికీ బ్లాక్ కాఫీ యిచ్చాడు.

మరో గంట తర్వాత స్టీమర్ కన్పించింది. వెంటనే క్రిందకు దిగాడు రవిశంకర్. వైర్‌లెస్‌లో కాంటాక్టు చేశాడు. ఓసారి ఫార్మాలిటీగా రక్షణ దళం ఆ షిప్‌ని హెచ్చరించబోతున్నట్లు, మిగిలిన కార్యక్రమం అంతా రవిశంకర్‌కే వదిలిపెడుతున్నట్లు వార్త వచ్చింది.

ఈలోపుగానే ఏం చేయాలో నిర్ణయించుకున్నాడు కెప్టెన్ రవిశంకర్. మరో గంట తర్వాత షిప్ పూర్తిగా కన్పించింది. దానిమీద ఏవిధమయిన గుర్తులు లేవు. మధ్యాహ్నమయినా అది అక్కడ నుంచి కదలకపోవడంతో అక్కడే 'ఏంకర్' అయిందని రూఢి బరుచుకున్నాడు రవిశంకర్.

ముగ్గుర్ని పిలిచాడు "మన ప్లాన్ మార్చుకోవాల్సి వచ్చింది" అంటూ తన కొత్త ప్లాన్‌ని వివరించాడు. నలుగురి దగ్గర సిగరెట్ పాకెట్ సైజులో వున్న వైర్లెస్ ట్రాన్సిమిటర్లున్నాయి. ట్రక్‌ని అడవిలో కన్పించకుండా దాచిపెట్టి, చెట్టు కొమ్మలు, ఆకులు కప్పారు.

నలుగురు జిప్ వున్న స్విమ్మింగ్ డ్రస్ ధరించారు. వాటిపైన ఆక్సిజన్ సిలిండర్స్ తొడుక్కున్నారు వీపున వచ్చేటట్లు. వాటర్ ప్రూఫ్ బాగ్‌లో పవర్‌ఫుల్ ఎక్స్‌పోజివ్స్ వేసుకున్నారు. తలకు రబ్బరు మాస్క్, కళ్ళకు

గ్లాస్ గాగుల్సు, నలుగురి చేతుల్లో అండర్ వాటర్ టార్చెస్ వున్నాయి.

నలుగురు సముద్రం దగ్గరకు చేరగానే మరోమారు హెచ్చరించాడు కెప్టెన్ రవిశంకర్. నలుగురు ఈదడానికి పనికివచ్చే రబ్బరు బూట్లను ధరించారు.

సముద్రంలోకి కొంతదూరంపోయి లోనికి మునిగి స్టీమర్ వైపుగా ఈదుకుంటూ పోసాగారు. రవిశంకర్ తన చేతిలో వున్న కంపాస్‌ని చూసి డైరెక్షన్స్ యిస్తున్నాడు. నలుగురూ నిశ్శబ్దంగా అండర్ వాటర్‌లో ఈదుకుంటూ, చేపపిల్లల్లా తేలుకుంటూ, స్టీమర్ దిక్కుగా పోసాగారు.

# 6

సముద్ర జలాలపై నిశ్చలంగా నిలబడి వుందా స్టీమర్. ఆధునిక యుద్ధనౌక కావటంవల్ల రకరకాల ఆయుధాలు అమర్చబడి వున్నాయి. నౌకలోని లైట్లు దేదీప్యమానంగా వెలుగుతున్నాయి.

కెప్టెన్ రవిశంకర్ తన సహచరులతో దాని దగ్గరకు చేరుకునేటప్పటికి సాయంత్రం ఆరు గంటలు దాటింది.

విపరీతంగా ఈదడంవల్ల అలసిపోయారు నలుగురు. అయినప్పటికి చేయబోయే కార్యం ఉత్సాహాన్నిస్తుంది. సముద్రంలో కూడా ప్రమాదమైన జంతువులు కాని, వృక్షాలు కాని లేనందువల్ల వారి ప్రయాణానికేమి ఆటంకం కలగలేదు.

నీటిలో సాధ్యమైనంత లోతులో మునిగి ప్రయాణించారు. నౌక యింకా ఏడెనిమిది వందల గజాల దూరంలో ఉందనగా కెప్టెన్ నెమ్మదిగా పైకి తేలి చూశాడు.

అది అవటానికి వార్‌షిప్ అయినా, రెండంతస్థులుగా వుంది. రెండు అంతస్థుల్లోనూ లైట్లు వెలుగుతున్నాయి. డెక్ మీద ఫిరంగులు మొదలయిన ఆయుధాలు కన్పిస్తున్నాయి అస్పష్టంగా. బహుశా రెండో అంతస్థు సిబ్బంది నివాసం కావచ్చని ఊహించాడు రవిశంకర్.

రెండు నిముషాలపాటు పరిశీలించినా డెక్ మీద కదలిక కన్పించలేదు. అంతలోనే రెండు ఆకారాలు గన్స్ పట్టుకొని రావటం గమనించి లోనికి ఈదుకుంటూ పోయాడు.

లోపల అనుచరులంతా అతని ఆజ్ఞల కోసం ఎదురు చూస్తున్నారు. పూర్తిగా చీకటి పడటంవల్ల లోపల కన్పించటం లేదు. కెప్టెన్ రవిశంకర్ టార్చ్‌ని సహచరుల వైపు త్రిప్పి ఒకసారి వెలిగించి ఆర్పేశాడు.

అతని సంజ్ఞని గమనించి ముగ్గురూ అతన్ని అనుసరించారు. నలుగురు నౌక అంచుకి చేరుకున్నారు. పైకి తేలారు. ఇప్పుడు వారు సరిగ్గా నౌక ప్రక్కనే అంచుకి ఆనుకొని ఉన్నారు. గాగుల్స్ తీసుకున్నారు.

"రతన్, జానీ, రాజన్!" పిల్చాడు నెమ్మదిగా రవిశంకర్.

"యస్ సర్!" సమాధానం యిచ్చారు వారు.

"నేనూ, రతన్ ఈ వైపున బాంబులు అమరుస్తాం. జానీ, రాజన్‌లు అవతలి ప్రక్క అమర్చండి. సరిగ్గా నలభై ఎనిమిది గంటల తర్వాత పేలాలి, జాగ్రత్త! క్విక్!" గాగుల్స్ తగిలించుకొని లోనికి మునిగాడు.

రతన్ కూడా రవిశంకర్‌తోపాటే నీటిలో మునిగాడు. జానీ, రాజన్‌లు పైకి తేలుతూనే నెమ్మదిగా అంచు వెంట రెండో ప్రక్కకు శబ్దం కాకుండా చేరుకున్నారు.

నీటిలో మునిగిన కెప్టెన్ రవిశంకర్; రతన్‌లు వాటర్ ప్రూఫ్ బ్యాగ్‌లో అమర్చబడిన బాంబులను నౌక ఇనుప గోడకి అంటించారు. వాటికి శక్తివంతమయిన మాగ్నెట్ అమర్చబడి ఉంది. దాని సాయంతో అది నౌకకు అతుక్కు పోయింది. టార్చి వెలుగులో బాంబులను 48 గంటలకు పేలేటట్లు అరేంజ్ చేశాడు. ఆ బాంబులన్నిటిని గజానికి మూడు చొప్పున అమర్చాడు. పావుగంటలో ఇద్దరు కలిసి అరేంజ్ చేయటం పూర్తయింది. మరో అయిదు నిమిషాల తర్వాత జానీ, రాజన్‌లు వచ్చి వెలిశారు.

"గుడ్! వచ్చిన పని ఇంత సులభంగా నెరవేరుతుందనుకోలేదు. పదండి!" అన్నాడానందంగా కెప్టెన్ రవిశంకర్.

అదే సమయంలో నౌక పైభాగాన సైరన్ మోగింది. క్షణాలలో శక్తివంతమయిన సెర్చిలైట్లు నౌక చుట్టూ సముద్రం మీదకు ప్రసరించాయి. అంతా పట్టపగలులా తయారయింది. ఏం జరిగిందో అర్థం కాలేదు వారికి. అప్పుడే మైక్‌లో విన్పించింది.

"మిస్టర్! మీ చర్యలన్నిటిని కనిపెడుతున్నాం. మర్యాదగా లొంగిపొండి."

కెప్టెన్ రవిశంకర్‌తోపాటు మిగిలిన ముగ్గురు బ్రాన్పడి పోయారు.

# 7

పైనుంచి బిల బిలమంటూ సముద్రంలోకి దూకారు కొంతమంది. అందరూ స్విమ్మింగ్ డ్రస్‌లోనే వున్నారు. ఎడమ చేతిలో టార్చి, కుడి చేతిలో తుపాకిలా వుంది. ఆ తుపాకి చివర బాణంలా చెక్కి వున్న ఒక యినుప కడ్డీ వుంది. ట్రిగ్గర్ నొక్కితే ఆ బాణం దూసుకుపోయి గుచ్చు

కుంటుంది. అండర్ వాటర్‌లో రివాల్వర్, తుపాకి బదులు దానిని ఉపయోగిస్తారు.

దాదాపు ఇరవైమంది సముద్రంలోకి దూకి తమనుచుట్టు ముట్టేసరికి కెప్టెన్ రవిశంకర్‌కు మతి పోయినట్లయింది. తానెంత మూర్ఖుడో అర్థం అయింది. తమ ప్రతి చర్య వారు గమనిస్తున్నారంటే నౌక అడుగు భాగంలో టెలివిజన్, మైక్రోఫోన్ ఉండి వుండాలి. సరిగ్గా తామున్న చోటుకే వచ్చారు గనుక టెలివిజన్ వుండి వుండాలి. చీకటిలో లైటు వెలిగించి బాంబ్‌లను అమర్చుతున్నపుడు తమ వునికి తెలిసి వుండాలి.

ఇదంతా ఆలోచించి తనని తాను తిట్టుకున్నాడు రవిశంకర్. తాము నల్గురు వాళ్ళని ఎదిరించి నిలవలేరు. తప్పించుకుపోయినా ఎంతో దూరం పోలేరు. మధ్యలో చని పోవటం ఖాయం. లొంగిపోయి, ప్రాణాలు దక్కించుకుంటె, దీనిని నాశనం చేయటానికి మరో ప్లాన్ ఆలోచించవచ్చు.

నౌక పైనుంచి సన్నటి నైలాన్ తాటి నిచ్చెన క్రిందకి జారవిడిచారు. ఆ మసక చీకట్లోనే తాడు పట్టుకొని పైకి ఎక్కారంతా. పదిమందివరకు రవిశంకర్, సహచరులు అమర్చిన బాంబ్‌లను తీసివేయటానికి వెళ్ళిపోయారు.

తన దురదృష్టాన్ని నిందించుకుంటూ పైకి ఎక్కాడు. అతని అనుచరులు కూడా అతని వెనకే వచ్చారు. పైన డెక్ అంతా పగలులా వుంది. కొంతమంది వ్యక్తులు చేతిలో మిషన్ గన్స్ పొజిషన్‌లో వుంచి డెక్ చుట్టూ నిలబడ్డారు. వారిని చూడగానే ఆ నౌక ఏ దేశందో తేలిగ్గా గ్రహించాడు రవిశంకర్. చైనా దేశపు నౌక అది.

ఆ నౌక కెప్టెన్ పొట్టిగా వున్నాడు. అతని ముఖం ఫ్లాట్ గా వుంది. కనుబొమ్మలు లేవు. పిల్లికళ్ళు, చిన్న గడ్డం, పల్చగా, సాగదీసి వున్నట్లు పెదాలు, తెల్లటి యూనిఫాంలో వున్నాడు. ఆ డెక్ మీద అనుచరు లంతా అదే డ్రస్‌లో వున్నారు.

"గ్లాడ్ టు మీట్ యు మిస్టర్స్!" కెప్టెన్ నవ్వుతూ చేయి ముందుకు చాపాడు. రవిశంకర్ చేయి ముందుకు అందించి "సేమ్ టు యూ. మై నేమ్ ఈజ్ రవిశంకర్, కెప్టెన్ రవిశంకర్!"

"గుడ్! మై నేమ్ ఈజ్ చాంగ్!" అని "కమాన్; లెట్స్‌గో!" అని వెనక్కు తిరిగాడు. అంతలోనే వెనక్కి తిరిగి "ఓ ఐయామ్ సారి! ప్లీజ్ రిమూవ్ యువర్ డ్రస్" అని నవ్వుతూ అనుచరులలో ఒకని వైపు చూశాడు. మరు క్షణమే నలుగురికి వారిలాంటి దుస్తులీయబడ్డాయి. నలుగురూ అక్కడే డ్రస్ మార్చుకొన్నారు. వారి వస్తువుల నన్నిం టిని కెప్టెన్ స్వాధీనం చేసుకున్నాడు.

నవ్వుతూ ముందుకు నడిచాడు కెప్టెన్ చాంగ్.

అతన్ని అనుసరించారు నలుగురు. వారి వెనుకే మిషన్ గన్స్ పట్టుకున్న యిద్దరు వ్యక్తులు అనుసరించారు.

అందరు కెప్టెన్ చాంగ్ వెంట, క్రింద రెండో అంతస్థులో ఉన్న చిన్న హాలులోకి ప్రవేశించారు. అక్కడ చాలా మంది సిబ్బంది చేరి తాగుతూ, తుళ్ళుతూ వున్నారు. సన్నగా మ్యూజిక్ విన్పిస్తోంది. శత్రువులకు దగ్గరలో వుంటూ అంత నిర్భయంగా సంచరిస్తున్న వారిని చూస్తే రవిశంకర్ కు ఆశ్చర్యం వేసింది. నిజంగానే వారి శక్తి యుక్తులు సాటిలేనివి అని అతనికి నమ్మకం కల్గింది.

హాలులో ప్రవేశించిన రవిశంకర్‌ను, అతని అనుచరులను చూసి హాలులో వున్నవాళ్ళు ఒక్క క్షణం మాటలు ఆపేశారు. తిరిగి తాము పట్టించుకోనట్లు తమ కబుర్లలో పడిపోయారు.

నడవమన్నట్లు వెనకనుంచి గన్ బారల్‌తో పొడవటంతో ముందుకి నడిచారు. అంతా హాలు దాటి ఓ చిన్న నడవాలోకి ప్రవేశించారు. ఆ నడవా పొడుగ్గా వుంది. దానికి అటూ, యిటూ కాబిన్స్ వున్నాయి. అందరు చివరగానున్న ఒక కాబిన్‌లోకి నడిచారు. కెప్టెన్ రవిశంకర్, అతని అనుచరులను వెన్నంటి వస్తున్న గార్డ్స్ బయటే ఆగిపోయి, తలుపులు మూశారు.

ఆ కాబిన్ విశాలంగా, అన్ని ఆధునిక సౌకర్యాలతో ఉంది. ఏమాత్రం కొరత కన్పించడం లేదు. హైక్లాస్ హోటల్లోని రూమ్‌లా వుంది. అది కెప్టెన్ చాంగ్ కాబిన్ అని గ్రహించాడు రవిశంకర్.

కెప్టెన్ చాంగ్ బెడ్‌పై కూర్చున్నాడు. రవిశంకర్‌ను ప్రక్కనే వున్న కుర్చీలో కూర్చోమని సైగ చేశాడు. అతని ముందు చిన్న టీపాయ్ వుంది. దాని మీద బ్రాందికాబోలు సీసాలో ఉంది. దాని ప్రక్కనే నాలుగు గ్లాసులున్నాయి.

రవిశంకర్ కుర్చీనొకదాన్ని లాక్కొని కూర్చున్నాడు. అతని ప్రక్కనే అతని అనుచరులు కూడా కూర్చున్నారు కుర్చీలలో.

నలుగురికి నాలుగు గ్లాసులలో బ్రాందీపోసి, తను సీసా తీసుకున్నాడు కెప్టెన్ చాంగ్. త్రాగి గ్లాసు క్రింద పెట్టాడు రవిశంకర్.

"ఫ్రెండ్స్!" చెప్పటం ప్రారంభించాడు చాంగ్.

"ఈ పాటికే మేమెవరమో, ఏ దేశస్థులమో గ్రహించి వుంటారు. ఇంతవరకు ఎవ్వరూ మా వునికి కనుక్కోలేక పోయారు. యిప్పుడు మీరు ఆ పని చేశారు. అయినా ఫరవాలేదు. ఎంచేతంటే మీరు తిరిగి వెళ్ళలేరు గనుక!"

విషపు నవ్వు నవ్వాడు కెప్టెన్ చాంగ్.

"బహుశా మీకు, మా గురించి పూర్తిగా తెలిసి వుండదు. తెలిసుంటే యింత సాహసం చేసేవారు కారు. ఈ వార్‌షిప్ అనేక ఆధునిక పరికరాలతో నిండి వుంది. అంతేకాదు, మామూలు పాసింజర్స్ నౌకల్లో ఎటువంటి సదుపాయాలు లభిస్తాయో; అవన్నీ యిక్కడ లభిస్తాయి. నౌకలోను, బయట టెలివిజన్, మైక్రోఫోన్ సెట్స్ అమర్చబడి వున్నాయి. వాటివల్ల నౌకలోను, నౌక బయట ఎక్కడ, ఏమి జరిగేది మాకు తెలిసిపోతుంది. అందువల్లే మీరు పట్టుబడ్డారు."

ఆగాడు కెప్టెన్ చాంగ్. సీసాలో ద్రవం ఒక గుక్క తాగాడు. అందరి ముఖాలలోకి చూసి చెప్పటం ప్రారంభించాడు.

"మాకున్నది ఒకే ఒక ధ్యేయం. ఎలాగయినా ఈ ప్రపంచాన్నంతా హస్తగతం చేసుకోవటం. అందుకు మొదటి మెట్టు మీ భారతదేశాన్ని కబళించటం. ఈ కార్యక్రమానికి ఎంతో శక్తి, యుక్తి అవసరం. అందువల్లే అనేక అణుబాంబులు, హైడ్రోజన్ బాంబులు తయారు చేసుకున్నాం. ఉన్నచోటునుంచి కదలకుండా ప్రపంచంలో ఎక్కడనయినా స్థావరాలను ధ్వంసంచేసే రాకెట్లను తయారుచేశాం.

ఇంత ఎందుకు? ప్రపంచ విజయానికి కావల్సిన అన్ని హంగులు అమర్చుకున్నాము. మొదట మీ దేశాన్ని ఆక్రమించుకుంటాము. మిగిలిన దేశాలు జరిగినది గ్రహించేలోపు అవికూడా మా హస్తగతం అయిపోతాయి.

ఈ కార్యక్రమానికి పాత పద్ధతులయిన నాయకులను హతమార్చటం, ఆందోళనలు రెచ్చగొట్టటం వంటివి మేము చేయం. మాకు శక్తి వుంది. యుక్తులున్నాయి. ఆ శక్తి చూపిస్తాం. ప్రపంచాన్ని లొంగదీసుకుంటాము.

పాపం! మమ్మల్ని ఏదో చేయాలని బయలుదేరి వచ్చి వుంటారు. పూర్ ఫెలోస్! రేపల్లా అనుభవించండి. రేపు సాయంత్రం పాపం మీరు...''

కెప్టెన్ చాంగ్ చివరి చుక్క తాగేశాడు. రవిశంకర్ లేచి నిలుచున్నాడు.

''మరోమాట!'' అన్నాడు చాంగ్. ''మీరు అమర్చిన బాంబులు అన్నిటిని నిరుపయోగం చేశారు మావాళ్ళు. వాటిని గురించి పట్టించుకోకండి. వెళ్ళండి!'' మంచం దగ్గరవున్న స్విచ్ నొక్కాడు.

తలుపు తెరుచుకొని గార్డ్సు వచ్చారు లోనికి. వారితో చైనాభాషలో ఏదో చెప్పాడు కెప్టెన్ చాంగ్.

తరువాత కెప్టెన్ రవిశంకర్, జానీని ఒక కాబిన్ లోను, రతన్, రాజన్‌లను మరో కాబిన్‌లోను బంధించారు.

# 8

తనను బంధించిన కాబిన్‌లో బెర్త్‌మీద కూర్చొని ఆలోచించసాగాడు కెప్టెన్ రవిశంకర్. జానీ, ఆయనకు ఎదురుగా కూర్చొని మౌనంగా ఆయన ముఖంవంక చూడసాగాడు.

"జానీ! కెప్టెన్ చాంగ్ ఏదో పెద్ద ఎత్తులోనే వున్నాడు. మనల్ని వెంటనే చంపకుండా ఒదిలాడంటే బహుశా తన పై అధికార్ల నుంచి ఆర్డర్స్ కోసం యెదురు చూస్తున్నాడేమో. ఏది ఏమయినా మనల్ని తేలిగ్గా చంపరు. చిత్రహింసలు పెట్టి, అనేక రహస్యాలు తెల్సుకొంటారు. ఈ లోపుగానే మనం నౌకలోనుండి తప్పించుకోవాలి. కాని ఎలా?"

ఎంత ఆలోచించినా ఏ దారి తోచలేదు. కిటికీదగ్గరకు నడిచి, గ్లాస్ లోనుంచి కన్పిస్తున్న చీకటిలోకి చూశాడు. అంతా అంధకారం. ఆలోచనలతో ఆ రాత్రి ఆయనకు సరిగ్గా నిద్రే పట్టలేదు.

మరునాడుదయమే గార్డ్స్ వెంట ఒక బట్లర్ వచ్చి కాఫీ, టిఫెన్ లు యిచ్చాడు. రాత్రికూడా తిండి లేక పోవటంవల్ల మారు మాట్లాడకుండా ఐటమ్స్ అన్నిటినీ ఖాళీ చేశారు. తరవాత చాంగ్ వచ్చి పరామర్శించి వెళ్ళిపోయాడు నవ్వుతూ.

అతని నవ్వు చూస్తుంటే జానీకి ఒళ్ళంతా కంపరం ఎత్తినట్లయింది. అమాంతం మీదపడి చంపేద్దాం అన్నంత ఆవేశం వచ్చింది. అతిప్రయత్నం మీద నిగ్రహించుకున్నాడు. అతడు వెళ్ళిపోగానే తలుపులు బంధించబడి, తాళం వేయబడ్డాయి.

కెప్టెన్ రవిశంకర్ పరిపరి విధాలుగా ఆలోచిస్తున్నా, అతనికేమి పాలుపోలేదు. తాము తప్పించుకోవటం అసాధ్యమే అనుకున్నాడు. 'షిప్ మీద దాడికి రావల్సిన యుద్ధ విమానాలు యింకా ఎందుచేత రాలేదు? తన వార్తల కోసం యెదురుచూస్తున్నారా?' అన్పించింది.

చివరికి తన ప్రాణాలు పోయినాసరే వీలయినంతమందిని చంపి, తను చావాలని నిశ్చయించుకున్నాడు. ఆ దేమాట చెప్పాడు జానీతో.

పదిగంటల సమయంలో బాంబ్ ప్రేలుళ్ళు, విమానం మోత విన్పించాయి. పరుగున గ్లాస్ విండోవద్దకు వెళ్ళి చూశాడు. నాలుగు యుద్ధవిమానాలు దాడి ప్రారంభించాయి.

షిప్ అంతా గడగడలాడింది. ఆ దాడిలో గ్లాస్ విండో పగిలిపోతే బావుండు నన్పించింది కెప్టెన్ రవి శంకర్ కి. అయితే ఆయన ఆశలు ఫలించలేదు. షిప్ కి ఏ విధమైన నష్టం జరగలేదు, కాని ఆ నాలుగు యుద్ధవిమానాలు నాశనం అయిపోయాయి.

కోపంతో విండోకేసి గుప్పిట బిగించికొట్టాడు రవి శంకర్. అది చాలా గట్టిది. కనీసం చిట్లనయినా చిట్లదని తెలుసు.

మధ్యాహ్నం తలుపు తాళం తెరుచుకుని బట్లర్ ట్రేతో ప్రవేశించాడు. అప్పటికి అంతా నిమ్మళించి సద్దుమణిగింది. బట్లర్ వెనుక ఇద్దరు గార్డులు తయారయ్యారు. రవిశంకర్ అప్పటికే వారిద్దరిమీద పడి ఎదురుదెబ్బ తీయాలని నిశ్చయించుకున్నవాడు, బట్లర్ ని చూసి చిన్నగా ఉలిక్కిపడ్డాడు. జానీకూడా అంతే!

ట్రే పైన కప్పిన గుడ్డను తీస్తూ ముందుకి వంగిన బట్లర్ చిన్నకాగితాన్ని ఒకకప్పు వెనక్కి నెట్టటం ఇద్దరు గమనించారు. గార్డ్స్ యిద్దరు బట్లర్ వెనక వుండటంవల్ల చర్యని గమనించలేను. రవిశంకర్ కళ్ళల్లోకి ఓమారు చూసి వెళ్ళిపోయాడు బట్లర్. తలుపు తాళం వేయబడింది.

"సులేమాన్!" ఆశ్చర్యంగా అన్నాడు జానీ.

తల పంకించాడు కెప్టెన్ రవిశంకర్.

# 9

"మీనుండి విడిపోయిన తరువాత నేనొక్కడినే స్వతంత్రంగా పనిచేయాలని నిర్ణయించుకున్నాను. అందరం ఒక్కసారే వెళ్తే, దురదృష్టవశాత్తు పట్టుబడితే తప్పించుకోవటానికి వీలుండదన్న అభిప్రాయంతో నే ఈ నిర్ణయానికి వచ్చాను. కాని నా అభిప్రాయం మీకు చెప్పలేదు.

అందరం, అంటే ముందు మీరు, మీకు కొద్దిదూరంలో నేను ఈదుకుంటూ షిప్‌ని చేరాము. కాని మీ ప్లాన్ మారిందని నాకు తెలియదు. పైకి చేరుకోవటానికి మార్గం వెతుకుతున్నప్పుడే మిమ్మల్ని గమనించి, పట్టుకోవడం జరిగింది. ఆ సమయంలో సముద్రం అడుగున చాలా లోతులో, దూరంగా ఈదుకుంటూ పోయాను.

మిమ్మల్ని పైకి ఎక్కించిన తరవాత కొంతమంది మీరు అరేంజ్ చేసిన బాంబ్‌లను తీసివేయటానికి వచ్చారు. అప్పుడే అతి చాకచక్యంగా ఒకడి ఆక్సిజన్ సిలిండర్ గొట్టాన్ని తెంపి, చంపేశాను. వాళ్ళతో పాటు కల్సిపోయి పైకి చేరాను. వారి దుస్తులు, నా దుస్తులు ఒకలాగే వుండటం నా అదృష్టం.

తరవాత బట్లర్‌లలో కల్సిపోయాను. నన్ను ఎవరూ గుర్తుపట్టలేదు. కారణం బట్లర్‌లను కొనిసలుగా చూస్తున్నారు. మిమ్మల్ని తప్పించటానికి విశ్వప్రయత్నం చేశాను. కుదరలేదు. క్షమించండి. చివరివరకు నా కర్తవ్యాన్ని వీడను. జైహింద్."

అది చదివి నిర్ఘాంతపోయాడు కెప్టెన్ రవిశంకర్. కాగితాన్ని జానీకి యిచ్చాడు. అతడుకూడా చదివిన తరువాత దాన్ని చింపి ముక్కలు ముక్కలుగా చేశాడు.

తన ప్లాన్‌లో వున్న లోటేమిటో తెల్సిందతనికి. అనుభవజ్ఞుడయిన తాను యింత పొరపాటు పని చేస్తాడని, తనింత మూర్ఖుడని భావించలేదు తను. బహుశా తనలోని ఈ అహంకారాన్ని గుర్తించే కాబోలు సులేమాన్ తన పథకాన్ని తనతో చెప్పలేదు.

మౌనంగా భోజనాలు ముగించారు. అవతల రాజన్, రతన్ పరిస్థితీ అలాగే వుంది. ఎంతో ఉత్సాహంతో చివరివరకు కృతకృత్యులయిన తాము, చివరి క్షణంలో పట్టుబడటం వారిని నిరాశా నిస్పృహలకు దారి తీయించింది. బోనులో బంధించబడ్డ సింహంలాగా తిరుగుతున్నాడు రాజన్.

సాయంత్రం నాలుగ్గంటల ప్రాంతంలో గార్డ్స వచ్చి నలుగురిని డెక్ మీదకు తీసుకుపోయారు. అప్పటికే అక్కడ కెప్టెన్ చాంగ్ చిన్న సింహాసనంలాంటి కుర్చీలో కూర్చొని ఏదో తాగుతున్నాడు. అతనికి ఎదురుగా, వరసాగ్గా నిలబెట్టారు రవిశంకర్ బృందాన్ని. నలుగురు ఫ్రీగా ఉండటంవల్ల తప్పించుకోవడానికి ఉపాయాలు వెదకసాగారు.

డెక్ చుట్టూ సాయుధులైన వ్యక్తులు మిషన్‌గన్స్‌తో రెడీగా నిలబడ్డారు. కాలు కదిపితే వళ్ళంతా చిల్లులు పడేలా వుంది.

పడమట సూర్యుడు వాలిపోతున్నాడు. సూర్యునివైపు వీపు పెట్టి నిలబడ్డారు నలుగురు. వారికెదురుగా కూర్చొని వున్నాడు కెప్టెన్ చాంగ్.

"మిస్టర్ రవిశంకర్! నేను చాలా జాలి గుండెల వాడినని అందరూ అంటారు. అందుకే కాబోలు మిమ్మల్ని చంపదలచలేదు."

ఆగి మరో గుక్క తాగాడు. అతడేదో ఎత్తువేయబోతున్నాడని అర్థం అయింది కెప్టెన్ రవిశంకర్ కి.

"నాకు జూదం అంటే చాలా ఇష్టం. ఇప్పుడు గమ్మత్తయిన ఓ ఆట ఆడబోతున్నాను. పందెం ఏమిటో తెల్సా? మీ ప్రాణాలే!" పకపక నవ్వాడు.

చెవులు రిక్కించి వింటున్నారు నల్గురు.

"ఇంతవరకు అపజయం ఎరుగని నన్ను, నా షిప్ ను నాశనం చేయాలని ఎంతో మంది ప్రయత్నించి ప్రాణాలు పోగొట్టుకున్నారు. ఇక్కడికి వచ్చిన వారెవరు తిరిగి వెళ్ళలేదు. మొదటి సారిగా మీరు వెళ్ళబోతున్నారు.

ఇప్పుడు మిమ్మల్ని వదిలేస్తాను. సరిగ్గా అరగంట తరువాత మేము కాల్పులు సాగిస్తాం. బాంబులు వేస్తాం. తప్పించుకుంటే మీ అదృష్టం. అంతా లక్! [illegible] ఉంది?" వికటంగా నవ్వాడు కెప్టెన్ చాంగ్.

అరగంటలో తీరాన్ని చేరుకోవడం కాదుగదా, కనీసం ఈ ప్రాంతాల నుంచి వెళ్ళటం కూడా సాధ్యం కాదని రవిశంకర్ కు తెలుసు. తాము ఎంతదూరం పోయినా, వాళ్ళ ఆయుధాలు శక్తివంతమయినవి. తాము తప్పించుకోవటం కల్ల.

ఎవరో వచ్చి కెప్టెన్ చాంగ్ చెవిలో ఏదో చెప్పాడు. అది వినగానే అదిరిపడ్డాడు చాంగ్.

"ఆయ్! మన షిప్ లో మరొక శత్రువా? తీసుకురండి. క్విక్!" అరిచాడు అసహనంగా.

మరుక్షణమే పెదరెక్కలు విరిచి పట్టుకొని, సులేమాన్ని నెట్టుకుంటూ ప్రవేశించారు ఇద్దరు వ్యక్తులు. రవిశంకర్ అదిరి పడ్డాడు. అతనికున్న ఒక్క ఆశ హరించి పోయింది.

# 10

"మిస్టర్ రవిశంకర్! ఇతను నీ బృదంలోనివాడే ననుకుంటాను. చాలా తెలివిగా పథకం అల్లావు. నాకు చిక్కినట్లే నటించి మరొకన్ని నియమించావు అవునా?"

కెప్టెన్ చాంగ్ ఇందాకటిలా లేడు. ముఖం జేవురించింది. కళ్ళు చింత నిప్పుల్లా తయారయ్యాయి. సులేమాన్ దగ్గరకు నడిచి, ఈడ్చి చెంపమీద కొట్టాడు. పళ్లు కదిలి, రక్తం బయటకు వచ్చింది.

"మిమ్మల్నిక బ్రతకనివ్వను. ఇందాకటి ఆటను రద్దు చేస్తున్నాను. నా కళ్ళ ముందే మిమ్మల్ని చిత్రహింసలు పెట్టి నాకసి తీర్చుకుంటాను." వెనుదిరిగి టేబుల్ దగ్గరకు నడిచాడు ఛాంగ్.

సులేమాన్ నెమ్మదిగా చేయి ఎత్తి వాచ్ చూసుకున్నాడు. ఎవరో హడావిడిగా వచ్చి చాంగ్ చెవిలో ఏదో ఊదారు.

"క్విక్! వెంటనే వెదకండి! డిటెక్టర్స్‌తో చూడండి!" చిందులేస్తున్నాడు కెప్టెన్ చాంగ్.

సులేమాన్ తనపథకం ఫలించినందుకు తృప్తిపడ్డాడు. ఇంజన్ రూంలో, కంట్రోలు రూంలో, మరికొన్ని ముఖ్యమైన చోట్ల శక్తివంతమయిన బాంబులు అరేంజ్ చేశాడు.

మరొక అయిదు నిమిషాలలో పేలుతాయి అవి. ఈ లోపు తాము తప్పించుకోవాలి. బాంబులన్నింటిని కను

గొనటం వారికి అసాధ్యం.

ఇంతలో ఆకాశంలో విమానాల ధ్వని విన్పించింది. అందరూ ఉలిక్కిపడి చూశారు. భారత గగనతలంనుండి రివ్వున ఎగురుకుంటూ వస్తున్నాయి కొన్ని విమానాలు.

తన మేసేజ్ అందినందుకు సంతోషించాడు సులేమాన్. రవిశంకర్ కళ్ళల్లోకి చూశాడు. అప్పటికే అంచుకి, తమకు మధ్య ఉన్నదూరం అంచనా వేసుకున్నాడు రవిశంకర్. వెనక్కి ఒక్క జంప్ చేస్తే సముద్రంలో పడిపోతారు.

విమానాల శబ్దం వినటంతోనే కెప్టెన్ చాంగ్‌లో కంగారు ఎక్కువయింది.

"ఫైర్" అని అరిచాడు.

కాని, అప్పటికే లేటయిపోయింది. అతని ముఖంలో భావం కనిపెట్టి, మెరుపులా వెనక్కి గెంతుతూ, "జంప్" అని అరిచాడు కెప్టెన్ రవిశంకర్. అయిదుగురూ సముద్రం లోకి దూకేశారు.

పిచ్చిగా అరుస్తూ రెయిలింగ్స్ దగ్గరకు వచ్చి తొంగి చూశాడు కెప్టెన్ చాంగ్. నీటిలో పడిన సులేమాన్ పైకి తేలి హేండ్ గ్రెనేడ్ ఒకటి పైకి విసిరి రివ్వున లోనికి పోయాడు. పైనుంచి కాల్చిన కాల్పులకి ఒక గుండు అతని భుజంలో దిగబడింది.

అయిదుగురు నీటిలో మునిగి నౌకకి దూరంగా ఈదు కుంటూ పోసాగారు. సులేమాన్ విసిరిన గ్రెనేడ్ పేలి కొంతమంది మరణించారు. చాంగ్‌కి మతిపోయినట్లయి కంట్రోలు రూంలోకి పరుగుతీశాడు.

ఇంతలో షిప్‌లో పెద్ద ప్రేలుడు సంభవించింది. మరు క్షణమే షిప్ భగభగమంటూ మండసాగింది. దానిలోని

ఇతర ఎక్స్‌ప్లోజివ్స్ కూడా అంటుకున్నాయి.

అదే సమయంలో...

పెద్ద విస్ఫోటంతో షిప్ అంతా తుత్తునియలై పోయింది. దాని భాగాలు ఎగిరి పడ్డాయి.

ఆ సరికే చాలా దూరంపోయారు రవిశంకర్ బృందం వారు.

భారత విమానాలు, వారి మీదుగా ఎగరసాగాయి. రవిశంకర్ పైకి తేలుతూ చేతులూపాడు. వాటిల్లోనుంచి క్రిందకి నిచ్చెనలు వేలాడ వేయపడ్డాయి.

"వెల్‌కం టు-ది ఫైవ్ మెన్ ఆర్మీ!" విమానం పైలెట్ రవిశంకర్ బృందాన్ని చిరునవ్వుతో ఆహ్వానించాడు.

—: ఐపోయింది :—